నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
TMEDIA
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 315
పేజీలు : 3
గురువారం 18.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## 'హర్మూజ్' మాదే

- నిర్వహణ బాధ్యత చూసుకుంటాం: ఇరాన్



**టిమీడియా, జూన్ 17, ఢిల్లీ బ్యూరో :** అమెరికా–ఇరాన్ మధ్య దశాబ్దాల ఘర్షణకు స్వస్తి పలుకుతూ ఇరు దేశాల మధ్య ఒక చారిత్రాత్మక శాంతి ఒప్పందం కుదిరేందుకు వేగంగా అడుగులు వేళ టెహ్రాన్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. అంతర్జాతీయ ఇంధన రవాణాకు జీవనాడీగా ఉన్న హర్మూజ్ జలసంధి పూర్తిగా ఇరాన్ దేశానికి చెందినదని పేర్కొంది. అంతేకాకుండా, దాని నిర్వహణ, రక్షణ బాధ్యతలు ఎప్పటికీ ఇరాన్ పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేసింది. శాంతి ఒప్పందం వేళ స్వయంగా ఇరాన్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ రెజా ఆరీఫ్ ఆ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. టెహ్రాన్‌లో ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో మహ్మద్ రెజా ఆరీఫ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన హర్మూజ్ జలసంధి ప్రాధాన్యతపై ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రపంచ ఇంధన వాణిజ్యంలో హర్మూజ్ జలసంధి పోషిస్తున్న పాత్రను, దానిపై ఇరాన్‌కు ఉన్న సార్వభౌమాధికారాన్ని స్పష్టం చేశారు.

# గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణ

## రెండో విడతలో వారికే ఇండ్లు



- మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు

**టీ మీడియా, జూన్ 17 ,హైదరాబాద్:** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

**గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే**

రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో



ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఎంపీడీవో స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి సంబంధిత ఇన్‌చార్జి మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హుల ఎంపికలో కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా ఎటువంటి పొరపాట్లు, వివక్షకు తావు లేకుండా అనర్హుల చొరబాటుకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

**దరఖాస్తు చేసుకోని గుడిసెల వాసులకు అవకాశం**

గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

**రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు**

రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన నేపథ్యంలో అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత**

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రెండో విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరాళ్లు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పైకప్పుల కింద నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

**అసంపూర్తి ఇళ్లకు కూడా అవకాశం**

గతంలో వివిధ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్మెంట్ స్థాయి లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చని పేర్కొన్నారు. అలాగే గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారు**

బీఎల్‌సీ (బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్) విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకొనే అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలు కలిగిన లబ్ధిదారులకు అవసరాన్ని బట్టి గ్రౌండ్ ప్లస్ వన్ (జి+1) నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేవలం రెండున్నర సంవత్సరాల కాలం లో దశాబ్దాల పేదల సొంతింటి కలలను సాకారం చేస్తున్నామని మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైందని, ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ద్వారా లక్షలాది పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపబోతున్నాం అని మంత్రి పొంగులేటి అన్నారు.

# అక్కడ ఘరానా దొంగ.. జిల్లాలో గజదొంగల పాలన

- ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అప్రమత్తత అవసరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**టీ మీడియా, జూన్ 17 , ఖమ్మం రూరల్ :** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ అందుగల హర్ష కన్వెన్షన్ హాల్‌లో పాలేరు నియోజకవర్గ స్థాయి పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, పార్టీ సభ్యత నమోదు అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో గజదొంగ పాలన కొనసాగుతుంటే.. ఖమ్మం జిల్లాలో ఘరానా దొంగల పాలన కొనసాగుతుందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్ధ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశం చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు.

## బీజేపీ వైఫల్యాలను..

# ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- కార్యాచరణ రూపొందిస్తున్న పీసీసీ



**టిమీడియా, జూన్ 17, ఢిల్లీ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్ బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఆర్థిక సంక్షోభం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, పరీక్ష పేపర్ల లీకేజీ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపట్టాలని ఏఐసీసీ నిర్ణయించింది. ప్రజల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించాలని, నాయకులంతా రోడ్డుపైకి వచ్చి జనం మధ్యలో ఉండాలని ఇప్పటికే స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. వీలైనంత త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్రాలకు పంపాలని కేంద్ర నాయకత్వం యోచిస్తోంది.

**బీజేపీ వైఫల్యాలను నిలదీయాలి**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నిర్ణయించింది. ఇటీవల దిల్లీలో జరిగిన రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, పార్టీ అగ్రనేతల అత్యవసర సమావేశంలో దేశంలో తాజా పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా నిరుద్యోగం, పరీక్ష పేపర్ల లీక్, పెట్రోల్, డీజిల్, ఎల్?పీజీ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడం వంటి అంశాలపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్టీ అభిప్రాయపడింది. ఈ అంశాలనే ప్రధాన అస్త్రాలుగా చేసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది.

**దేశవ్యాప్తంగా ఆందోళనకు ప్రణాళిక**

దేశవ్యాప్తంగా ఆందోళనల ద్వారా ఒత్తిడి పెంచేలా దాదాపు రెండు, మూడు నెలలపాటు కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించింది. వీలైనంత త్వరగా అన్ని రాష్ట్రాలకు ఈ మేరకు సమాచారాన్ని పంపించాలని ఏఐసీసీ తీర్మానం చేసింది. అందులో భాగంగా ఉద్యమం నిర్మించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ శాఖ సిద్ధమవుతోంది. పార్టీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించడం, సిబ్బందితో విస్తృతంగా చర్చించి ఈ ఉద్యమం కోసం ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేయాలని పీసీసీ నిర్ణయించింది.

**రాష్ట్రంలోనూ ఆందోళనకు సిద్ధమవుతున్న కాంగ్రెస్**

రాష్ట్రంలో పార్టీ ఎక్కడెక్కడ బలంగా ఉంది? బలహీనంగా ఎక్కడుంది? అన్న అంశంపై కూడా ప్రత్యేక దృష్టి సారించనుంది. పార్టీ నిర్మాణం, ఎన్నికలు, ఎస్?సీ, ఎస్టీ, ఓబీసీ సాధికారత, రాజకీయ వ్యవహారాలు, సంస్థాగత బలోపేతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న అంశంపై వ్యూహాలు రచిస్తోంది. రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిల్లో తరచూ సమావేశాలు నిర్వహించి, నాయకుల మధ్య సయోధ్య కుదర్చాలని పార్టీ నాయకత్వం యోచిస్తోంది. సామాజిక న్యాయం లక్ష్యంగా అన్ని స్థాయిల కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, యువతకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఏఐసీసీ ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తరించి క్షేత్రస్థాయిలో ప్రజలతో అనుసంధానం పెంచడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని పార్టీ స్పష్టం చేస్తోంది.

# అభిమానిని పరామర్శించిన పవన్ కల్యాణ్

- చల్లగా ఉండాలంటూ ప్రేమతో లేఖ

**టిమీడియా, జూన్ 17, హనుమకొండ :** హనుమకొండలో పవన్‌కల్యాణ్ పర్యటించారు. హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్(17) అనే అభిమాని ఇంటికెళ్లి పవన్ పరామర్శించారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఆప్యాయంగా పలకరించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్–మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి భరోసానిచ్చారు.

**వెంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు**


తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు పవన్‌కల్యాణ్ కప్పారు. దేవుడి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అలాగే నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్‌కల్యాణ్‌ను అనుకరిస్తూ వేసిన డ్యాన్సు వీడియోలను చూశారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిరంజన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేయిస్తానని తెలిపారు.

**బాలుడికి ప్రేమతో పవన్ లేఖ**





బాలుడిని పరామర్శించిన పవన్ అతనికి చిరకాలం గుర్తిండిపోయేలా ఓ లేఖ రాశారు. "ప్రియమైన నిరంజన్‌కు ప్రేమతో.. దుర్గామాత ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నా" అని డైరీలో పవన్ కల్యాణ్ రాసి ఇచ్చారు. కాగా బాలుడి పరామర్శ అనంతరం భద్రకాళి అమ్మవారిని పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో అర్చకులు పవన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పవన్ కల్యాణ్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో పవన్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు.



# 11 రోజులైనా జ్ఞానేశ్వరి జాడలేదు

- పాప ఆచూకీ కోసం బొమ్మల ఏర్పాటు



**టిమీడియా, జూన్ 17, కాకినాడ :** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జానూ) అదృశ్యమై 11 రోజులు గడిచినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రతి రోజు ఏదో ఒక సమాచారం వస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు చివరకి నిరాశే మిగులుతోంది. చిన్నారి కోసం పోలీసులు, ప్రత్యేక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ ఇప్పటివరకు పాప విషయంలో ఎలాంటి కీలక ఆధారాలు

2లో..

# ముంచుకొస్తున్న ముప్పు

- కొత్త బొగ్గు గనులు వస్తేనే సింగరేణికి మనుగడ

2లో..

# తెలంగాణలో 89 లక్షల ఓటర్ల వివరాల్లో తేడాలు

- సరైన గుర్తింపు పత్రాలు లేకుంటే ఓట్లు గల్లంతే!

2లో..

# తెలంగాణలో 89 లక్షల ఓటర్ల వివరాల్లో తేడాలు

• సరైన గుర్తింపు పత్రాలు లేకుంటే ఓట్లు గల్లంతే!



**టీమీడియా, జూన్ 17, హైదరాబాద్ బ్యూరో :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్?) ఓటర్లకు ఒక పెద్ద సవాలుగా మారనుంది. 2025 ఓటర్ల జాబితాలోని 30 శాతం వరకు పేర్లు, 2002లో నిర్వహించిన సర్? జాబితాతో మ్యాపింగ్? జరగలేదు. మ్యాపింగ్? అయిన చాలా మంది ఓటర్ల వివరాలలో తప్పులు ఉన్నాయని ఎన్నికల సంఘం అధికారులు గుర్తించారు. ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న సర్? ప్రక్రియ వల్ల వీరందరిపై ప్రభావం పడనుంది. 2025 జాబితాలోని 3,38,29,018 మంది ఓటర్లలో, కేవలం 2,36,54,232 మందిని మాత్రమే గుర్తించారు. వీరిలో 89,44,713 మంది వివరాలలో పలు వ్యత్యాసాలను అధికారులు గుర్తించారు. ఈ ఓటర్లు సరైన గుర్తింపు పత్రాలను సమర్పించకపోతే, వారిని జాబితా నుంచి తొలగించే అవకాశాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లలో మరో 1,01,74,786 మందిని అన్?మ్యాపింగ్? జాబితాలో చేర్చారు.

**మ్యాపింగ్? ప్రక్రియలో అనుమానాలు**

ఈ ఓటర్లలో చాలా మంది ఎన్యూమరేషన్? పత్రాలను నింపితే వారికి నోటీసులు అందే అవకాశం ఉంది. అప్పుడు వారు సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. మ్యాపింగ్‌తో పాటు అన్‌మ్యాపింగ్‌లో కూడా లోపాలు ఉన్నట్లు మొత్తం 1,91,19,499 మంది ఓటర్లు గుర్తించారు. కొన్ని చోట్ల మ్యాపింగ్ ప్రక్రియ సరిగ్గా జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల ఓటర్లు ప్రభావితం కావచ్చని రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

**అనేక నియోజకవర్గాల్లో ఓటర్లపై ప్రభావం**

నారాయణపేట జిల్లాలోని మక్తల్ నారాయణపేట నియోజకవర్గాల్లోని మొత్తం 4,95,581 మంది ఓటర్లలో, 4,23,118 మంది (85.38 శాతం) ఓటర్లను మ్యాపింగ్ చేశారు. మ్యాపింగ్ జరిగిన ఓటర్లలో, 1,87,149 మంది వివరాలలో వివిధ లోపాలను కనుగొన్నారు. అన్‌మ్యాపింగ్‌లో మరో 72,463 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో వలస కార్మికులు, పేదవారు అధిక సంఖ్యలో ఉన్నారు. రాబోయే ఎస్ఐఆర్ (సర్?) వల్ల వీరే ఎక్కువగా ప్రభావితం అవుతారని స్థానిక ప్రచారం జరుగుతోంది.

**ఉమ్మడి ఆదిలాబాద్?లో 95,439 మంది ఓటర్లలో తేడాలు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భాగమైన నిర్మల్‌లో 2,64,309 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,12,270 మంది జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. అయినా వీరిలో 95,439 మంది ఓటర్ల వివరాలలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,50,455 మంది ఓటర్లలో 1,61,056 మందిని గుర్తించగా, వారిలో 71,000 మంది వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు.

**ఆరు నియోజకవర్గాల్లో 12,53,284 మంది ఓటర్ల గుర్తింపు**

నిజామాబాద్ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో 14,39,900 మంది ఓటర్లు ఉన్నారు. బీఎల్‌వోలు 12,53,284 మంది ఓటర్లను గుర్తించారు. వీరిలో 5,07,143 మంది వివరాలలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు.

**అత్యధికంగా మేడ్చల్? మల్కాజ్?గిరిలో**

రాష్ట్రంలో ఓటర్ల వివరాలలో అత్యధిక వ్యత్యాసాలు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఉన్నాయి. ఐదు నియోజకవర్గాల్లోని మొత్తం 29,78,532 మంది ఓటర్లలో, 12,89,802 మందిని గుర్తించారు. వీరిలో 8,38,150 మంది వివరాలు తప్పుగా ఉన్నాయి. వీరంతా ఎన్నికల సంఘం ప్రకటించిన గుర్తింపు కార్డులలో ఒక దానిని సమర్పించాల్సి ఉంటుంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ సంగారెడ్డి జిల్లాల్లో గుర్తించిన ఓటర్ల వివరాలలో కూడా అనేక వ్యత్యాసాలు ఉన్నాయి.

**గుర్తింపు పత్రాలు ఇవే :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు/ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్?యూ) ఉద్యోగులు లేదా పెన్షనర్లకు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు (పీపీవో) 01-07-1987కు ముందు అంతకు ముందు ప్రభుత్వ సంస్థలు/బ్యాంకులు/తపాలా కార్యాలయాలు/ఎల్ఐసీ/పీఎస్ఈ జారీ చేసిన ఏదైనా పత్రాలు జనన ధృవీకరణ పత్రం లేదా పాస్‌పోర్ట్ గుర్తింపు పొందిన బోర్డులు/విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్ లేదా ఇతర విద్యా అర్హత పత్రాలసంబంధిత అధికార సంస్థ జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం అటవీ హక్కుల ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు జారీ చేసిన కుటుంబ నమోదు ధృవీకరణ పత్రంప్రభుత్వం జారీ చేసిన ఏదైనా భూమి/ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం

# ఫోన్లు స్విచ్ ఆఫ్

• ఉద్ధవ్ సేన ఎంపీల జాడెక్కడ



**టిమీడియా, జూన్ 17, ఢిల్లీ బ్యూరో :** చాలా రోజుల తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ రాజకీయ పరిణామాలు జరిగినట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గానికి చెందిన కొందరు లోక్‌సభ ఎంపీలు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో మరోసారి తిరుగుబాటు జెండా ఎగురువేసినట్లుగా భావిస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీపైనే కేంద్రీకృతమైంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం ఉద్ధవ్ వర్గానికి చెందిన పలువురు ఎంపీలు ఢిల్లీలోని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే కుమారుడు, ఎంపీ శ్రీకాంత్ శిందే నివాసంలో సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశానికి ఏక్‌నాథ్ శిందే కూడా హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ సమావేశం ముగిసిన తర్వాత కొందరు శివసేన ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనున్నట్లు సమాచారం. ముందుగా లోక్‌సభలో ఈ తిరుగుబాటు ఎంపీలు ప్రత్యేక గ్రూప్‌గా ఏర్పడి తర్వాత ఆ వర్గాన్ని ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో విలీనం చేసే ప్రక్రియపై చర్చ జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన దాదాపు ఆరుగురు ఎంపీలు శిందే వర్గంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెబుతున్నారు. ఇందులో సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, నాగేశ్ పాటిల్ ఆశ్తికర్, ఓంరాజే నింబాల్కర్, బావుసాహెబ్, సంజయ్ జాధవ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా వీరితో పాటు రాజాబావ్ వాజే కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రేకు అత్యంత సన్నిహితులుగా భావించే అర్విందర్ సావంత్, అనిల్ దేశాయ్ ఢిల్లీకి చేరుకోనున్నారు. ఇక రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ఇప్పటికే ఢిల్లీలో ఉన్నారు. ఉద్ధవ్ ఠాక్రే ఆదివారం రోజు ముంబైలోని తన మాతోశ్రీ నివాసంలో నిర్వహించిన సమావేశానికి 9 మంది ఎంపీల్లో నలుగురు మాత్రమే ప్రత్యక్షంగా హాజరుకావడం రాజకీయంగా అనుమానాలకు తావిస్తోంది. మిగతా కొందరు ఆన్‌లైన్ లేదా ఫోన్ కాల్ ద్వారా సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం.

**ఖండించిన సంజయ్ రౌత్**

ఢిల్లీలో ఈ పరిణామాలపై మాట్లాడిన సంజయ్ రౌత్– పార్టీ ఎంపీలంతా ఉద్ధవ్ ఠాక్రేతోనే ఉన్నారని స్పష్టం చేశారు. ఎంపీలను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ. 15 కోట్ల చొప్పున అడ్వాన్స్ ఇస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ చీలికపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, శివసేన 60 ఏళ్ల చరిత్ర కలిగిన బలమైన క్యాడర్ బేస్డ్ పార్టీ అని, ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనే శక్తి తమకు ఉందని చెప్పారు. ఈ పరిణామాలపై శిందే వర్గం కూడా స్పందించింది. మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ ఈ అంశంపై మాట్లాడారు. బాలాసాహెబ్ ఠాక్రే సిద్ధాంతాల్ని నమ్మి, ఏక్‌నాథ్ శిందే నాయకత్వంపై విశ్వాసం ఉంచే ప్రజాప్రతినిధులకు తమ పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. ఇటీవల సంజయ్ దేశ్‌ముఖ్, కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్‌తో ఢిల్లీలో రహస్యంగా సమావేశం కావడం రాజకీయ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది.

**అసలేం జరగనుంది?**

దీంతో ప్రస్తుతం శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే ఎంపీలు నిజంగానే శిందే వర్గంలో చేరతారా? లేక ఇది కేవలం రాజకీయంగా ఒత్తిడి సృష్టించే ప్రయత్నమేనా? అన్నది ఢిల్లీలో జరగనున్న సమావేశాల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవైపు ఎంపీల ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడం, కీలక నేతలు ఢిల్లీలో మకాం వేయడం, వరుస భేటీలు మహారాష్ట్ర రాజకీయాల్లో మరో పెద్ద ట్విస్ట్‌కు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఎంపీలు నిజంగానే పార్టీ మారితే ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి మరో పెద్ద ఎదురుదెబ్బ తగలనుంది.

# ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటు

- సభ్యులను నియమించిన ప్రభుత్వం

**టీ మీడియా, జూన్ 17 ,హైదరాబాద్ :** తెలంగాణలోని ఉద్యోగుల ఆరోగ్య పథకంఅమలు కోసం ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్టు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పెన్షనర్ల ప్రతినిధులతో కూడిన ట్రస్టీల పేర్లను వెల్లడించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు మరో 16 మంది ఆయా శాఖలకు చెందిన చీఫ్ సెక్రటరీ, సెక్రటరీలు సభ్యులుగా కొనసాగుతారని స్పష్టం చేసింది. వీరితో పాటు మరో 10 మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులను, మరో ముగ్గురిని పెన్షనర్ల ప్రతినిధుల పేర్లను ప్రకటించింది.ఉద్యోగ సంఘాల ప్రతినిధుల్లో టీఎన్జీవోస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు చావ రవి ట్రస్టీలో సభ్యులుగా ఉన్నారు. టీజీ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ రెడ్డి, ఎస్టీయూ అధ్యక్షుడు సదానందం గౌడ్, ట్రెసా అధ్యక్షుడు వి రవీందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ లచ్చిరెడ్డి, ఎస్టీఎఫ్ అధ్యక్షులు సైదులు, తెలంగాణ క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ దాస్య నాయక్ సభ్యులుగా ఉన్నారు.అదేవిధంగా తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి వెంకట్‌రెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, తెలంగాణ ఉమెన్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్ ఆర్ ఉమాదేవిని సభ్యులుగా ఉంటారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రకటనలో వెల్లడించారు.ఇప్పటివరకు జారీ చేసిన అన్ని మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని, ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రతిపాదించేందుకు బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదనంగా, ఉద్యోగుల ఆరోగ్య కార్డుల జారీకి సంబంధించిన విధానాలను కూడా ట్రస్ట్ ప్రతిపాదించాలని సూచించారు.

# అధికారులపై... అవినీతి నిరోధక శాఖ కొరడా

• స్వేచ్ఛతో దూకుడు పెంచిన ఏసీబీ

**టిమీడియా, జూన్ 17, హైదరాబాద్ బ్యూరో :** ప్రస్తుతం కొందరు అధికారులు చాప కింద నీరులా అవినీతికి పాల్పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లంచాలు తీసుకుంటూ అక్రమంగా ఆస్తులను పోగేసుకుంటున్నారు. ఇలాంటివి అధికమవుతుండటంతో అవినీతి నిరోధకశాఖ వీటిపై దృష్టిసారించింది. గడచిన 13 రోజుల్లోనే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు మూడు నమోదు చేసి అధికారుల చిట్టా బయటపెట్టింది. అక్రమార్కులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తుండటంతో అంతా అప్రమత్తమవుతున్నారు.

**నిదర్శనంగా పలు ఘటనలు**

అధికారిక లెక్కల ప్రకారం గడిచిన 13 రోజుల్లో ఏసీబీ రూ.36.9 కోట్ల అక్రమార్జనను గుర్తించింది. లంచాలు తీసుకొని దొరికిన వారిలో, ఎవరి ఆస్తిని లెక్కించినా మార్కెట్ విలువ ప్రకారం రూ.100 కోట్లకు పైనే ఉంటుందని తేలింది. కాళేశ్వరం మాజీ ఈఎన్సీలు మురళీధర్‌రావు, భూక్యా హరిరామ్, ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్ నుంచి ఇటీవల అనిశాకు చిక్కిన, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మద్రి వంశీమోహన్, ఈ నెలలో దొరికిన భుజంగరావు, మోహన్ నాయక్, నరహరిరావుల ఉదంతాలే ఇందుకు నిదర్శనం.

**లంచాల్లో మొదటి స్థానంలో పోలీసులే**

లంచాలు తీసుకొని ఏసీబీకి చిక్కుతున్న వారిని గమనిస్తే అధికంగా ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్న అధికారులే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. వీరంతా ప్రజలను లంచాలు ఇవ్వాలని పీడిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సంవత్సరం ఏసీబీ చేసిన రైడ్లలో పోలీసు అధికారులే ఎక్కువగా ఉన్నారు. అన్యాయం జరిగిందని పోలీసుల దగ్గరకు వెళ్తే, అమాయకుల దగ్గర నుంచే పైసలు లాగుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్? 16 వరకు ఏకంగా 14 కేసులు పోలీసులపైనే నమోదు అయ్యాయి.

**తర్వాత స్థానంలో రెవెన్యూ డిపార్ట్?మెంట్?**

పోలీసుల తర్వాత అధికంగా లంచాలకు పాల్పడుతున్నది రెవెన్యూశాఖ. ప్రతి కుటుంబానికి నిత్య జీవితంలో రెవెన్యూ శాఖతో సంబంధం ఉంటుంది. దీనివల్ల ప్రతి ఒక్కరి దగ్గర ఎంతో కొంత లంచాలు తీసుకొనేందుకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పంచాయతీ వ్యవహారాలను చూసేందుకు చాలా వరకు ప్రజలను లంచం అడుగుతున్నారు. ఈ విధంగా ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఇదంతా అవినీతికి పరాకాష్ఠగా మారింది.

**అభివృద్ధి పనుల్లో అవినీతి వరద**

అక్రమార్జనలో అధికంగా లాగుతుంది మాత్రం అభివృద్ధి పనులు చేయిస్తున్న అధికారులనే తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వాలు రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నాయి. ఈ బాధ్యతలు తీసుకున్న అధికారులు అక్రమంగా లబ్ధి పొందుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నీటిపారుదలశాఖ చేసిన విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు వద్ద రూ.9.42 కోట్లు గుర్తించగా, ఈఈగా పనిచేసిన నూనె శ్రీధర్ వద్ద రూ.7 కోట్లు, కాళేశ్వరం ఈఎన్సీగా పనిచేసిన భూక్యా హరిరామ్ వద్ద రూ.5.26 కోట్ల అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.

**రవాణాశాఖలోనూ అధికంగా అక్రమార్జన**

రోడ్లు, భవనాల అభివృద్ధి అంటూ అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. వీటికి సంబంధించిన ఉదంతాలు ఇటీవలి కాలంలో ఎన్నో బయటపడ్డాయి. మహబూబ్?నగర్? రవాణాశాఖ ఉప కమిషనర్? కిషన్? రూ. 12.72 కోట్లు కూడబెట్టినట్లు బయటపడింది. ఈ నెలలో అదనపు ఎస్పీ (సస్పెన్షన్) భుజంగరావు రూ.5.92 కోట్లు, రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీ మోహన్‌నాయక్ రూ.17.94 కోట్ల అక్రమార్జన వెలుగులోకి వచ్చింది. తాజాగా మంగళవారం చిక్కిన ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్ డీడీ సుంకరి నరహరిరావు అక్రమార్జన రూ.13.05 కోట్లుగా తేల్చారు. ఈ ముగ్గురి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో కనీసం రూ.500 కోట్లు ఉంటుంది.

**దూకుడు పెంచిన ఏసీబీ**

ఇలాంటి ఘటనలు అధికమవుతుండటంతో ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. దీంతో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో అక్రమార్కుల చిట్టా ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. 2020లో ఈ కేసులు కేవలం 94 నమోదయ్యాయి. గత ఏడాది ఈ సంఖ్య 199కి చేరింది. అంటే ప్రతి రెండు రోజులకు ఒక కేసు చొప్పున వెలుగులోకి వస్తున్నాయి. అయినప్పటికీ కొంతమంది అధికారులు భయం లేకుండా యూపీఐ ద్వారా లంచాలకు పాల్పడుతున్నారు. వరంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అక్కడున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లకు ఏజెంట్లు ఏడాది కాలంలో రూ.42,03,125 చెల్లించినట్లు గుర్తించారు.

**2025, 2026లో గుర్తించిన మొత్తం ఆస్తులు**

జూన్? 16 వరకు శాఖల వారిగా పోలీసు డిపార్ట్?మెంట్?లో 14 కేసులు, రెవెన్యూలో 13, మున్సిపల్ శాఖలో 8, పంచాయతీరాజ్?లో 8, విద్యాశాఖలో 6 కేసులు నమోదు అయ్యాయి. 2026 లో ఇలా రూ.36,92,84,217 విలువైన ఆస్తులు గుర్తించింది. అధికారిక విలువ ఇంతకు పదిరెట్లకు పైమాటే. 2025లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ రూ.96,13,50,554 విలువైన ఆస్తుల్ని గుర్తించింది. అనధికారికంగా వీటి విలువ కనీసం రూ.వెయ్యి కోట్లు ఉంటుంది.

# ముంచుకొస్తున్న ముప్పు

• కొత్త బొగ్గు గనులు వస్తేనే సింగరేణికి మనుగడ



**టిమీడియా, జూన్ 17, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పడిపోతోంది. రోజురోజుకు పడిపోతున్న సింగరేణి ఉత్పత్తి పెను సమస్యగా మారబోతోంది. గత సంవత్సరం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని 6 కోట్ల టన్నులకు తగ్గించేసింది. 2025-26లో ఉత్పత్తి లక్ష్యాన్ని తొలుత 7.20 కోట్ల టన్నులు సాధించాలని నిర్దేశించి 6 కోట్లు లక్ష్యం పెట్టుకుని 5.80 కోట్ల టన్నులే సాధించింది.ఇదే తరహాలో ఈ సంవత్సరం కూడా 6 కోట్ల టన్నులే లక్ష్యాన్ని పెట్టుకుంది. 2027-28లో సింగరేణిలో 4 గనులు మూతపడనున్నాయి. కాగా ఈసంవత్సరం 1.25 కోట్ల టన్నుల ఉత్పత్తి నిలిచిపోనుంది. అదే సమయంలో మరో 9 కొత్త గనుల్లో ఉత్పత్తి ప్రారంభిస్తేనే సంస్థ మనుగడ కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**కొత్త గనులు ప్రారంభం ఎప్పుడు**

కొత్త బొగ్గు గనులపై ఉత్పత్తి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. సింగరేణి కూడా ఇందుకోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఈ సంవత్సరం 3, వచ్చే సవంత్సరం మరో 2 కొత్త గనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. నిజానికి ఈ గనులు సంస్థకు కొత్తగా కేటాయించినవి కావు. గతంలోనే ఆయా ప్రాంతాల్లో తవ్వకాలు ప్రారంభించారు. అయితే వాటిని వదిలేయడంతో నేడు వీటిపై కన్నేశారు. గతంలో భూగర్భంలో తవ్వి వదిలేసిన వాటిని ఉపరితల గనులు(ఓసీ)గా మార్చాలని, ప్రస్తుతం నడుస్తున్న ఓసీలకు కొనసాగింపుగా వీటిని ప్రతిపాదించారు.

**3 గనులకు అనుమతులు**

కొత్త గనులు త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా వీటి అనుమతులు తీసుకునే ప్రక్రియలు వేగవంతం చేయాలని సింగరేణిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కోరింది. దీంతో సంస్థ యాజమాన్యం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. వీటిలో 3 గనులకు అనుమతులు వచ్చాయి. వీటిలో ఒడిశాలోని నైనీ బ్లాకును ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. అప్పటికే మూతపడ్డ భూగర్భగనుల లోతుల్లో ఇంకా మిగిలి ఉన్న బొగ్గును వెలికితీయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న ఉపరితల గనులకు కొనసాగింపు వంటివి కలిపి 8 ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి.

**కొత్త ప్రాజెక్టుల వివరాలివే**

కొత్తగూడెంలోని వీకే కోల్ మైన్ బొగ్గు తవ్వకాలు ఆపేసిన గనిలో 19 కోట్ల టన్నుల నిల్వలు,జేకే ఓపెన్ కాస్ట్ గని (ఇల్లెందు ఏరియా) - 1.96 కోట్ల టన్నులు,రామగుండం ఓసీ-1 విస్తరణ ప్రాజెక్టు (రామగుండం-3 ఏరియా) - 18.10 కోట్ల టన్నులు,గోలేటి ఓపెన్ కాస్ట్ (బెల్లంపల్లి ఏరియా) - 3.89 కోట్ల టన్నులు, ఎంవీకే ఓపెన్ కాస్ట్ - 3.03 కోట్ల టన్నులు,మణుగూరు ఓపెన్ కాస్ట్ ఎక్స్‌టెన్షన్ (మణుగూరు ఏరియా) - 4.04 కోట్ల టన్నులు,ఆర్.కె.పి. ఓసీపీ ఫేజ్-2 (మందమర్రి ఏరియా) - 3.44 కోట్ల టన్నులు,పీకే కోల్ మైన్, కొండాపూర్ (మణుగూరు ఏరియా) - 6.2 కోట్ల టన్నులు.

**సరఫరా కావడం లేదు**

ఇటీవల బొగ్గు నిల్వలను ఉద్దేశిస్తూ కేంద్ర విద్యుత్? మండలి ఓ నివేదికను విడుదల చేసింది. దీనిలో భాగంగా దేశంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్?కు తగినంత బొగ్గు థర్మల్? ప్లాంట్లకు సరఫరా కావడం లేదని వెల్లిడించింది. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఏపీ, గుజరాత్? ఇలా అనేక రాష్ట్రాల్లోని థర్మల్? కేంద్రాల్లో బొగ్గునిల్వలు కనీస స్థాయికన్నా దారుణంగా పడిపోయాని స్పష్టం చేసింది. జూన్? 13 నాటికి తెలంగాణ విద్యుత్పత్తి సంస్థ (జెన్?కో) ప్లాంట్లలో ఉండాల్సిన కనీస నిల్వ 25.54 లక్షల టన్ను (ఎల్?టీ)లకు గాను 24 శాతం (6.09 ఎల్?టీ) మాత్రమే ఉంది.

# 11 రోజులైనా జ్ఞానేశ్వరి జాడలేదు

• పాప ఆచూకీ కోసం బొమ్మల ఏర్పాటు



**టిమీడియా, జూన్ 17, కాకినాడ :** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జానూ) అదృశ్యమై 11 రోజులు గడిచినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రతి రోజు ఏదో ఒక సమాచారం వస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు చివరకి నిరాశే మిగులుతోంది. చిన్నారి కోసం పోలీసులు, ప్రత్యేక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ ఇప్పటివరకు పాప విషయంలో ఎలాంటి కీలక ఆధారాలు కూడా లభించలేదు.

**'నా జానూను తీసుకురండి'.. తల్లి ఆవేదన**

కన్నబిడ్డ కోసం జానూ తల్లి గుండె ముక్కలవుతోంది. ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించిన చిన్నారి ఒక్కసారిగా కనిపించకుండాపోవడంతో ఆమె జీవితం శోకసంద్రంగా మారింది. ప్రతి అడుగులోనూ జానూ జ్ఞాపకాలే వెంటాడుతున్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 'నా పాప ఎక్కడ ఉన్నా క్షేమంగా ఉండాలి, ఒక్కసారి నా కళ్ల ముందు కనిపిస్తే చాలు' అంటూ తల్లి కన్నీటి పర్యంతమవుతున్న దృశ్యాలు స్థానికులను కలచివేస్తున్నాయి. గ్రామంలో ఎవరైనా కనిపించినా, ఏ వాహనం వచ్చినా పాప గురించిన సమాచారం చెబుతారేమోనని ఆమె ఆశగా ఎదురుచూస్తోంది.

**అడవి జంతువుల కోణంలోనూ దర్యాప్తు**

చిన్నారి అదృశ్యమైన ప్రాంతానికి సమీపంలో తోటలు, కొండ ప్రాంతాలు ఉండటంతో అడవి జంతువుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేపట్టారు. బాలిక ఆనవాళ్లు లభించిన ప్రాంతంలోని ఇనుప కంచె వద్ద రెండు బొమ్మలను అమర్చి వాటిలో మాంసాహారం ఉంచారు. ఆ వాసనకు జంతువులు వస్తే కెమెరాల్లో నమోదు కావచ్చన్న ఉద్దేశంతో చుట్టుపక్కల ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేశారు.

**థర్మల్ డ్రోన్లతో రాత్రింబవళ్లు గాలింపు**

అర్ధరాత్రి, తెల్లవారుజామున థర్మల్ డ్రోన్లతో పాటు రాత్రివేళల్లో కూడా స్పష్టంగా చిత్రీకరించే కెమెరాల సహాయంతో చుట్టుప్రక్కల ప్రాంతాలన్నీ పరిశీలిస్తున్నారు. డీఎస్పీ తిలక్ తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు 6 కిలోమీటర్ల పరిధిలో గాలించగా, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు దాదాపు 10 కిలోమీటర్ల వరకు విస్తృతంగా అన్వేషించాయన్నారు.

**అపహరణ కోణంలోనూ ప్రత్యేక దర్యాప్తు**

చిన్నారి ఇనుప కంచె దాటి వెళ్లిన తర్వాత ఎవరైనా ఎత్తుకెళ్లి ఉండవచ్చనే అనుమానంతో ప్రత్యేక బృందాలు కేడీపేట వరకు వెళ్లి విచారణ జరుపుతున్నాయి. ఇప్పటివరకు సుమారు 170 ఫోన్ కాల్స్‌ను విశ్లేషించి సంబంధిత వ్యక్తులను నాలుగు బృందాలు ప్రశ్నిస్తున్నాయి. అలాగే 15 రోజుల క్రితం ప్రాంతానికి వచ్చిన సంచార జాతుల వ్యక్తుల కదలికలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

**ప్రతి క్షణం ఉత్కంఠే**

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హోంమంత్రి వంగలపూడి అనిత కూడా జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌తో మాట్లాడి దర్యాప్తు పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. జానూ ఆచూకీ కోసం అధికారులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తుండగా, తల్లి కళ్లలో మాత్రం ఒక్కటే ఆశ కనిపిస్తోంది. 'నా బిడ్డ తిరిగి వస్తుంది' అన్న నమ్మకం ఆ తల్లి మనస్సులో గూడుకట్టుకొని ఉంది. ప్రస్తుతం ఆ కుటుంబం ప్రతి క్షణం ఉత్కంఠ, ఆవేదన మధ్య గడుపుతోంది.



# తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభమైన పెళ్లి సందడి

**జూన్ 18 నుంచి జులై 9 వరకే శుభ ముహూర్తాలు**

**టీ మీడియా, జూన్ 17 ,హైదరాబాద్ :** తెలుగు లోగిళ్లలో మళ్లీ పెళ్లి సందడి ప్రారంభమైంది. గత నెలన్నర రోజులుగా మూఢం, అధిక జ్యేష్ఠ మాసంలో మంచి రోజులులేక పెళ్లిళ్లు జరగలేదు. ఈ నెల 15 నుంచి నిజ జ్యేష్ఠ మాసం మొదలవగా వచ్చే రోజుల్లో ( జూన్? 18 నుంచి వచ్చే నెల 9 వరకు) పరిమితంగా శుభముహూర్తాలు ఉన్నాయి. తిరిగి వచ్చే నెల 15 నుంచి ఆషాఢమాసం, గురుమూఢం ప్రారంభమై ఆగస్టు 15 వరకూ పెళ్లి ముహూర్తాలు లేవు. ఆ తర్వాత శ్రావణ మాసంలోనే వివాహాలకు అవకాశాలు ఉండటంతో ప్రస్తుత సీజన్‌లో కల్యాణాలు కుదిరిన కుటుంబాల్లో హడావుడి ప్రారంభమైంది. మరోవైపు పరిమిత ముహూర్తాల కారణంగా పురోహితులు, క్యాటరింగ్, ఫంక్షన్‌హాళ్లు తదితరాలకు డిమాండ్ పెరగడంతో ఆయా కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

**ఆకాశాన్ని తాకిన బంగారం :** సంవత్సరం క్రితంతో పోలిస్తే బంగారం ధర చాలా బాగా పెరిగింది. పేద, దిగువ మధ్య తరగతి వారైనా కుమార్తెకు వివాహాలు చేసే సమయంలో మంగళసూత్రాలు, కమ్మలు, బంగారు గొలుసు, గాజులు, ముక్కుపుడక వంటి అవసరాలకు కనీసం 5 నుంచి 6 తులాలు కొనడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ఆ మేరకు కొనుగోలు చేయాలన్నా రూ.7 నుంచి 8 లక్షలు ఖర్చు అవుతోంది. ఇక కల్యాణ మండపాలు, భోజనాలు, అలంకరణ, రాకపోకలకు తక్కువలో తక్కువ మరో రూ.5 నుంచి 10 లక్షల వరకూ వెచ్చించక తప్పని పరిస్థితి.

**ఇరాన్-అమెరికా యుద్ధం - పెరిగిన పెళ్లి ఖర్చు**

వంటకాల రకాలను బట్టి కనీసం ప్లేటుకు రూ.500 తక్కువ కాకుండా వెచ్చించాల్సి వస్తోందని ఫంక్షన్ హాలు యజమానులు అంటున్నారు. 25 రకాల వంటకాలు లేకుండా భోజనం పెట్టడం నామోషీగా భావిస్తున్నందున భోజనాల వ్యయం చాలా ఎక్కువగా ఉంటోందని తెలిపారు. ఇరాన్-అమెరికా యుద్ధం ముందు నాటితో పోలిస్తే ఒక వివాహానికి అదనంగా కనీసం రూ.5 లక్షల వరకూ ఖర్చు పెరిగిందని స్పష్టం చేశారు. పరిమిత ముహూర్తాల నేపథ్యంలో పురోహితుల దగ్గర నుంచి డెకరేషన్, క్యాటరింగ్, అద్దె వాహనాల వరకు అందరూ ఎక్కువ మొత్తం డిమాండ్ చేయడం కూడా భారం పెంచుతోందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.ధరలను పెంచుతున్న ఫంక్షన్ హాళ్లు : ఇరాన్-అమెరికా యుద్ధం కారణంగా డీజిల్, పెట్రోలు సహా నిత్యావసర ధరలు పెరగడం వల్ల పెళ్లి వ్యయం కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు భారీగా పెరిగాయని వధూవరుల తల్లిదండ్రులు అంటున్నారు. ఈ కారణంతో క్యాటరింగ్ నిర్వాహకులు ధరలు పెంచేశారని, వాహనాల కిరాయిలు కూడా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సాధారణంగా వేసవి కాలంలో ఫంక్షన్ హాళ్లకు డిమాండు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈసారి అధిక జ్యేష్ఠం కారణంగా వాటికి గిరాకీ లేదని, ఇప్పుడు ముహూర్తాలు ప్రారంభం కావడంతో నిర్వాహకులు వాటి ధరలను కూడా పెంచుతున్నారని తెలిపారు.




# ఎయిర్‌పోర్టు కోసం 1800 ఎకరాలు కావాల్సిందే

- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ

**టిమీడియా, జూన్ 17,ఆదిలాబాద్ :** లో ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నవిమానాశ్రయం కోసం 1800 ఎకరాలు అవసరమని అధికార యంత్రాంగం ప్రాథమికంగా తేల్చింది. ఎయిర్‌ఫోర్స్, పౌరవిమానాల రాకపోకలకు అనువుగా ఉండాలంటే ఇప్పటికే రక్షణశాఖ పరిధిలోని 369 ఎకరాలతో పాటు అదనంగా మరో 1500 ఎకరాల స్థలం అవసరమవుతుందని తేల్చింది.



### క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు

బెంగళూరులోని ఎయిర్‌ఫోర్స్ విభాగం గ్రూప్ కమాండర్లు సబర్వాల్, హెగ్డే , స్క్వాడ్రన్ లీడర్ రెడ్డితో కూడిన అధికారుల బృందం క్షేత్రపర్యటనలో భాగంగా ఆదిలాబాద్‌లో విమానాశ్రయానికి అనుకొని ఉన్న భూములను పరిశీలించింది. కలెక్టర్ రాజార్షిషా, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి నిషాన్‌ఘాట్, బంగారుగూడ అనుకుంట ప్రాంతాల్లో పర్యటించింది. విమానాశ్రయం ఏర్పాటుకు అవరోధంగా ఉండే హైటెన్షన్ విద్యుత్‌వైర్లు, అనుకుంట, బంగారుగూడ వాగుల విషయం చర్చకు వచ్చింది.

### విమానాశ్రయం ఏర్పాటు దిశగా అడుగులు

ప్రణాళిక ప్రకారం 800 ఎకరాల్లో ఒకసారి, వెయ్యిఎకరాల్లో ఒకసారి విమానాశ్రయం ఏర్పాటుచేయాలని భావించినా రక్షణ, పౌరవిమానాల రాకపోకలకు అనువుగా ఉండాలంటే కచ్చితంగా 1800 ఎకరాలు అవసరమని అధికారుల బృందం నిర్ణయించింది. అనంతరం కలెక్టరేట్‌లో సమీక్షించింది. త్వరలో పూర్తిస్థాయి నివేదిక ఆధారంగా దిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేయాలని నిర్ణయించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న విమానాశ్రయం కోసం ముందడుగు పడిందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. విమానాశ్రయం రాకతో ఆప్రాంతంలో ఉద్యోగకల్పన, దేశంలోని వివిధ ప్రాంతాలకు అనుసంధానత ఏర్పడనుంది.

### భూసేకరణ చర్యలు వేగవంతం

సీఎం రేవంత్? రెడ్డి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేసినట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా వెల్లడించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎయిర్‌ఫోర్స్ విభాగ అధికారులు జేపీ సబర్వాల్, ఎస్.జీ.హెడ్గే, పౌరవిమానయాన విభాగ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ అదనంగా డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) కోసం మరో 1500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణకు మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించినట్లుగా వివరించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు భూసేకరణ త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు.సీఎం రేవంత్ రెడ్డి సూచనల ప్రకారం ఎయిర్?పోర్ట్? ఏర్పాటుకు సంబంధించి 1700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనికి అదనంగా? డిఫెన్స్ ఇన్?ఫ్రాస్ట్రక్చర్,? ఎయిర్?ట్రైనింగ్? ఇన్?స్టిట్యూట్? కోసం 1500 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించింది. ఇది ఆదిలాబాద్? జిల్లా వాసులకు మంచి శుభవార్త. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ కలిసి ఎయిర్?పోర్ట్? కలసాకారానికి కృషిచేస్తున్నాం – రాజర్షిషా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్

**కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో పనిచేస్తున్నాం :** సేకరించిన భూములను రక్షణశాఖ, ఎయిర్‌ఫోర్ట్ అథారిటీకి అప్పగిస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. అటు పౌరవిమానయానం, ఇటు దేశ రక్షణ శిక్షణ కేంద్రానికి జిల్లా వేదిక కానుండటం ప్రజలకు చరిత్రాత్మక అవకాశంగా ఆయన అభివర్ణించారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ రక్షణ శాఖ కోరిన 1500 ఎకరాల భూసేకరణ కోసం కేంద్ర, రాష్ట్రాల సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. స్థానిక శాసనసభ్యుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ విమానాశ్రయ ఏర్పాటుతో ఆదిలాబాద్‌వాసుల కల నెరబోతోందన్నారు. రన్‌వే కోసం అదనంగా మరో 80 ఎకరాలను సేకరించాల్సి ఉందని చెప్పారు. అనంతరం ఎరోడ్రమ్ గ్రౌండ్?కు వెళ్లి సేకరించాల్సిన భూముల పటాలను పరిశీలించారు.



## వైద్యులే లక్ష్యంగా...

# సైబర్ మాయాజాలం..

- రూ.29.8 కోట్లు నష్టపోయిన డాక్టర్లు

**టీ మీడియా, జూన్ 17 ,హైదరాబాద్:** సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాలు దాలుస్తుండగా, ఇప్పుడు వైద్యులే మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబర్ 2024 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో మొత్తం 735 మంది వైద్యులు సైబర్ మోసాల బారిన పడి దాదాపు రూ.29.8 కోట్లను కోల్పోయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య వృత్తి నిపుణులకు ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రారంభించింది.

### ఉన్నత విద్యావంతులైనా తప్పని ముప్పు

ఈ పెరుగుతున్న మోసాల నేపథ్యంలో వైద్య వృత్తి నిపుణులకు ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (×జజజ)లో వైద్య రంగానికి చెందిన 72 మంది ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో టి జి సిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు అధిక విద్యావంతులు, వృత్తిపరంగా విజయవంతమైన వ్యక్తులను కూడా అత్యంత చాకచక్యంగా టార్గెట్ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. చదువు, ఉద్యోగ హోదా లేదా సామాజిక స్థాయి ఎంత ఉన్నా సైబర్ మోసాల నుంచి ఎవరూ పూర్తిగా సురక్షితులు కాదని, అప్రమత్తత మరియు వెంటనే ఫిర్యాదు చేయడమే ప్రధాన రక్షణ మార్గాలని సూచించారు.

### ఏ రకమైన మోసాల్లో ఎంత నష్టం?

గణాంకాల ప్రకారం వ్యాపార, పెట్టుబడి (బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్) మోసాల వల్ల అత్యధిక నష్టం జరిగింది. ఈ కేటగిరీలో 127 మంది వైద్యులు రూ.22.3 కోట్లను కోల్పోయారు. అలాగే డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగిన మోసాల్లో 22 మంది డాక్టర్లు రూ.2.2 కోట్లను కోల్పోయారు. గుర్తింపు దొంగతనం (ఐడెంటిటీ థెఫ్ట్) కేసుల్లో 144 మంది వైద్యులు సుమారు రూ.2 కోట్ల మేర నష్టపోయినట్లు వెల్లడైంది. ఇక వ్యక్తిగత వివరాలు లేదా అధికారుల పేర్లు ఉపయోగించి మోసం చేసే ఇంపర్సనేషన్ స్కామ్‌లలో 181 మంది వైద్యులు రూ.1.3 కోట్లను కోల్పోగా, ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా జరిగే మోసాల్లో 188 మంది డాక్టర్లు మరో రూ.1 కోట్ల మేర నష్టపోయారు.వీటితో పాటు ఉద్యోగాలు, రుణాలు, బీమా, యూపీఐ లావాదేవీలు, మ్యాట్రిమోనీ, సెక్స్టార్షన్, క్రిప్టోకరెన్సీ పెట్టుబడుల పేరుతో కూడా వైద్యులను మోసం చేసిన ఘటనలు నమోదయ్యాయి.

### సైబర్ సేఫ్టీ: అధికారుల కీలక సూచనలు

సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, పెట్టుబడి ఆఫర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏదైనా మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. తెలంగాణలో వైద్యులను లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఈ సైబర్ మోసాలు ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి.



## బీభత్సం సృష్టించిన గాలివాన

**టీ మీడియా, జూన్ 17 ,దేవరకద్ర:**మహబూబ్నగర్ జిల్లా దేవరకద్రలో వడగండ్లతో కూడిన గాలివాన ప్రజలను భయాందోళనలకు గురి చేసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో వారాంతపు సంతలో ఏర్పాటు చేసిన దుకాణాలు, షెడ్లు ధ్వంసమయ్యాయి. వ్యాపారులు, కొనుగోలుదారులు ప్రాణభయంతో పరుగులు తీశారు.పోచమ్మ ఆలయం ముందు ఉన్న భారీ చెట్టు గాలివాన ధాటికి సగం నేలకొరిగి రోడ్డుపై పడింది.దీంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, అధికారులు చెట్టును తొలగించే పనులు చేపట్టారు. ఎస్బీఐ బ్యాంక్ ముందు విషాద ఘటన చోటుచేసుకుంది. గాలివానకు బ్యాంకు సమీపంలోని ప్రహరీ గోడ కూలి పక్కనే ఉన్న కారుపై పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్ సంతోష్ మృతి చెందాడు. గాయపడిన వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, ఒకరి పరిస్థితి విషమంగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.గాలివాన బీభత్సంతో కూరగాయల వ్యాపారం తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా, చెట్లు విరిగి పడటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.

## యుద్ధంలో ట్రంప్

# ఘోర పరాజయం..

### ప్రపంచం ముందు నవ్వులపాలైన అమెరికా




**టిమీడియా, జూన్ 17, ఢిల్లీ బ్యూరో :** ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌తో ఒప్పందం పూర్తయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘనంగా ప్రకటించారు. దీనిని అమెరికా సాధించిన చారిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. కానీ, వైట్ హౌస్ వెలుపల ప్రపంచ దేశాల స్పందన, రాజకీయ వర్గాల మూడ్ మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. అక్కడ ఎలాంటి సంబరాలు లేవు సరే కదా, కనీసం ఆశాజనకమైన వాతావరణం కూడా కనిపించడం లేదు. మీడియా రూమ్‌లు, అంతర్జాతీయ విధాన రూపకర్తలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఈ పరిణామంపై భిన్నమైన చర్చ నడుస్తోంది. దీనిని అమెరికా సాధించిన విజయంగా కాకుండా, రాజకీయంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా భరించలేని ఓ యుద్ధం నుంచి వాషింగ్టన్ తన ముఖాన్ని కాపాడుకుంటూ బయటపడేందుకు చేసిన ప్రయత్నంగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇంకాస్త ఘాటుగా చెప్పాలంటే, ఇది అమెరికాకు, ముఖ్యంగా ట్రంప్‌కు ఎదురైన ఘోర పరాజయమని నిపుణులు తేల్చి చెప్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగో ప్రొఫెసర్ రాబర్ట్ ఎ. పేప్ ఈ పరిణామాన్ని ఒక "విపత్కర వ్యూహాత్మక పరాజయం"గా అభివర్ణిస్తూ, అమెరికా ఒక ఎస్కలేషన్ ట్రాప్ (ఉద్రిక్తతల ఉచ్చు) లో చిక్కుకుందని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హెచ్చరించారు.అమెరికా ప్రతిష్టకు భంగం..అమెరికా అధికార యంత్రాంగం ఈ ఒప్పందాన్ని విజయంగా రంగులద్దాలని చూస్తున్నా, వాస్తవ పరిస్థితులు దానికి అస్సలు సహకరించడం లేదు. వంద రోజులకు పైగా సాగిన భీకర ఘర్షణలు, బిలియన్ల కొద్దీ డాలర్ల ప్రజాధనం వృథా, సైనిక సంపత్తి నష్టం, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అంతర్జాతీయ రవాణాకు ఏర్పడిన తీవ్ర అడ్డంకులు అమెరికా ప్రతిష్టను దెబ్బతీశాయి. వీటన్నింటికీ తోడు, అమెరికాలో త్వరలో జరగబోయే మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి వాషింగ్టన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా ఇప్పుడు ఇరాన్‌పై ఆంక్షల సడలింపునకు, స్తంభింపజేసిన ఆస్తుల విడుదలకు, అలాగే ఇరాన్ పునర్నిర్మాణం కోసం భారీ ప్యాకేజీని ప్రకటించడానికి సిద్ధపడటం గమనార్హం. దీనిని టెహ్రాన్ (ఇరాన్) ఇప్పటికే తన భారీ విజయంగా ప్రపంచానికి చాటుకుంటోంది. అమెరికా బలహీనతను ఎండగడుతూ ఇటీవల 'సిబిఎస్ న్యూస్ ఛానెల్‌కు చెందిన ఫేస్ ది నేషన్ కార్యక్రమంలో జర్నలిస్ట్ మార్గరెట్ బ్రెన్నాన్ చేసిన ఇంటర్వ్యూ సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించింది. ఈ ఇంటర్వ్యూలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ మాట్లాడుతూ, తాము సైనిక ఒత్తిడి, నావికా దళాల ముట్టడి ద్వారా హార్ముజ్ జలసంధిని నిరంతరం తమ ఆధీనంలోనే ఉంచుకున్నామని చెప్పుకొచ్చారు..అయితే, జర్నలిస్ట్ బ్రెన్నాన్ వెంటనే ఆయన్ను గట్టిగా నిలదీస్తూ, ఈ చర్చల్లో భాగంగా హార్ముజ్ జలసంధిని మళ్లీ తెరిపించడం కోసమే అమెరికా వారాల తరబడి తీవ్రంగా శ్రమించిందని గుర్తుచేశారు. ఒకవేళ జలసంధిపై అమెరికాకే పూర్తి నియంత్రణ ఉంటే, దానిని పునరుద్ధరించడం అనేది చర్చల్లో అంత పెద్ద ప్రధానాంశం ఎందుకు అయిందని ప్రశ్నించారు. ఈ సూటి ప్రశ్నకు రక్షణ మంత్రి హెగ్‌సెత్ సరైన సమాధానం చెప్పలేక, పదే పదే పాత మాటలనే తిప్పితిప్పి చెబుతూ కాలయాపన చేశారు. ఆయన చెప్పిన "పర్ఫార్మెన్స్ బేస్డ్ టైమ్‌లైన్స్" వంటి పదాలు ఇంటర్నెట్‌లో తీవ్రమైన ఎగతాళికి గురయ్యాయి.

అమెరికా ప్రభుత్వం మాటలకు, చేతలకు అస్సలు పొంతన లేదనే విషయాన్ని ఈ ఇంటర్వ్యూ బహిర్గతం చేసింది. వాషింగ్టన్ నిజంగానే ఆ జలాలపై ఆధిపత్యం చెలాయించి ఉంటే, ఈ జలమార్గాన్ని తెరిపించడానికి ఇన్ని రోజులు ఎందుకు చర్చలు జరపాల్సి వచ్చిందనే ప్రశ్నే ఇప్పుడు అమెరికా లొంగుబాటు కథనానికి కేంద్ర బిందువుగా మారింది. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌కు చెందిన అనుభవజ్ఞుడైన మిడిల్ ఈస్ట్ చర్చల ప్రతినిధి ఆరోన్ డేవిడ్ మిల్లర్ కూడా ఇరాన్ ఇంటర్నేషనల్ పాడ్‌కాస్ట్ 'ఐ ఫర్ ఇరాన్'లో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఈ యుద్ధం పొడవునా ఇరాన్ తన ప్రాక్సీ నెట్‌వర్క్‌ల ద్వారా, ప్రపంచ ఇంధన సరఫరాను అడ్డుకోగల సామర్థ్యంతో అమెరికాపై గట్టి పట్టు సాధించిందని ఆయన విశ్లేషించారు. మరికొందరు రాజకీయ నేతలు దీనిపై ఇంకా ఘాటుగా స్పందించారు. డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు సెత్ మౌల్టన్ 'ఎమ్ఎస్ నౌ' ఛానెల్‌తో మాట్లాడుతూ, ఈ ఒప్పందం మరేదో కాదు, డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఇరాన్ సుప్రీం లీడర్‌కు సమర్పించుకున్న "లొంగుబాటు పత్రం" అని ఎద్దేవా చేశారు. ట్రంప్ మాత్రం తన సైనిక ఒత్తిడి వ్యూహం వల్లే ఇరాన్ లొంగివచ్చిందని, హార్ముజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని, ఈ ఒప్పందం వల్ల ఇరాన్ అణుబాంబు తయారు చేయకుండా అడ్డుకున్నామని సోషల్ మీడియాలో గొప్పలు చెప్పుకుంటున్నారు.ట్రంప్‌పై రాజకీయ ఒత్తిడికానీ ఈ ఒప్పందం లోపలి వివరాలు చూస్తే అసలు కథ వేరేలా ఉంది. కీలకమైన అణు వివాదాలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు, వాటిని మరో 60 రోజుల చర్చల విండోలోకి నెట్టేశారు. ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షల ఎత్తివేతతో పాటు, యుద్ధంలో దెబ్బతిన్న ఇరాన్ మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం కోసం దాదాపు 300 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి ప్యాకేజీపై కూడా ఈ ఒప్పందంలో చర్చలు జరిగాయి. దీనిని ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ 'మెహర్ న్యూస్' అమెరికా చెల్లించబోయే యుద్ధ నష్టపరిహారంగా అభివర్ణించింది. అయితే ది న్యూయార్క్ టైమ్స్ వంటి పాశ్చాత్య మీడియా సంస్థలు దీనిని అంతర్జాతీయ ప్రైవేట్ పెట్టుబడిగా పేర్కొంటూ, ఇందులో జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్ వంటి ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయని రాశాయి. ట్రంప్ మాత్రం ముందస్తుగా ఎలాంటి నగదు చేతులు మారడం లేదని నొక్కి చెబుతున్నా, ప్రభుత్వ ప్రకటనలకు, లీక్ అవుతున్న ఒప్పంద నిబంధనలకు మధ్య ఉన్న తేడా ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోంది.

ఈ వివాదం అంతా ఫిబ్రవరి 28న ఇరాన్ అణు సామర్థ్యాలను దెబ్బతీయడానికి, ఆ ప్రాంతంలో దాని ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడులతో ప్రారంభమైంది. అయితే ట్రంప్ ఊహించినట్లుగా ఇది సులభంగా ముగిసిపోలేదు. నావికా దళాల ముట్టడి, ప్రపంచ ఇంధన మార్కెట్లో సంక్షోభం, రవాణా నౌకలపై దాడులతో యుద్ధం సుదీర్ఘంగా సాగింది. మే మధ్య నాటికి ఈ యుద్ధం కోసం పెంటగాన్ దాదాపు 25 నుండి 29 బిలియన్ డాలర్ల ప్రత్యక్ష సైనిక వ్యయాన్ని భరించాల్సి వచ్చింది. దీనికి తోడు, తటస్థంగా ఉన్న వాణిజ్య నౌకలపై జరిగిన క్షిపణి దాడుల్లో ముగ్గురు భారతీయ సిబ్బంది మరణించడం అంతర్జాతీయంగా అమెరికా వ్యూహంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. స్వదేశంలో కూడా ట్రంప్‌పై రాజకీయ ఒత్తిడి తీవ్రమైంది. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు సమీపిస్తుండటం, అంతర్జాతీయంగానే కాకుండా అమెరికా దేశీయ మార్కెట్లో కూడా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడం ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా పెద్ద మైనస్‌గా మారింది.మరోవైపు జూలై 4న అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. ఇంతటి చారిత్రాత్మకమైన సందర్భంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాటలు విని తానే స్వయంగా మొదలుపెట్టిన ఒక అసంపూర్ణ యుద్ధం నీడ దేశంపై పడటం ట్రంప్‌కు ఇష్టం లేదు. ఇరాన్ అణుబాంబు తయారు చేస్తోందంటూ నెతన్యాహు గత పాతికేళ్లుగా చేస్తున్న ప్రచారాన్ని నమ్మి ట్రంప్ ఈ యుద్ధానికి దిగారనే విమర్శలు ఉన్నాయి. డెమోక్రాట్లు, ట్రంప్ వ్యతిరేకులు ఈ యుద్ధాన్ని అమెరికా ప్రతిష్టను దిగజార్చిన ఒక అనవసరపు వ్యవహారంగా చిత్రీకరిస్తున్నారు. మరోవైపు.. ఈ ఒప్పందం భవిష్యత్తులో నిలబడుతుందా అనేదానిపై కూడా సందేహాలు ఉన్నాయి. లెబనాన్‌లోని హెజ్బొల్లాతో ఉన్న ఉద్రిక్తతలు ఈ తాత్కాలిక శాంతిని ఎప్పుడైనా చెడగొట్టవచ్చని నిపుణుడు ఆరోన్ డేవిడ్ మిల్లర్ హెచ్చరిస్తున్నారు. ఇటు ఇజ్రాయెల్‌లో కూడా ఈ ఒప్పందంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇజ్రాయెల్ జర్నలిస్ట్ గిడియాన్ లెవీ దీనిని ఇజ్రాయెల్ పరాజయంగా, నెతన్యాహు వ్యక్తిగత ఓటమిగా వర్ణించారు. అలాగే మాజీ అమెరికా ప్రత్యేక ప్రతినిధి ఇలియట్ అబ్రామ్స్ మాట్లాడుతూ, ఇరాన్‌లో ప్రస్తుత పాలన అంతమైతేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. ట్రంప్ మద్దతుదారులు మాత్రం ఒక పెద్ద ప్రాంతీయ యుద్ధాన్ని నివారించడమే తాము సాధించిన వ్యూహాత్మక విజయమని సమర్థించుకుంటున్నారు. కానీ, అంతర్జాతీయ రాజకీయాల్లో కనిపించే దృశ్యాలే ముఖ్యం. ప్రస్తుతం ప్రపంచం దృష్టిలో అమెరికా ఒక సూపర్ పవర్ హోదాను కోల్పోయి, ఇరాన్ నిబంధనలకు తలవంచి ఒప్పందం చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. అమెరికా రక్షణ మంత్రి టీవీ ఇంటర్వ్యూలో సమాధానం చెప్పలేక తడబడిన ఆ వీడియో క్లిప్పే, ఓటమిని విజయంగా రంగులు మార్చాలని చూసిన అమెరికా విఫల యుద్ధానికి సజీవ సాక్ష్యంగా మిగిలిపోయింది.




## మంచిర్యాల జిల్లాలో

# నకిలీ విత్తనాల విక్రేత

- ఏపీ వ్యాపారిపై పీడీ యాక్ట్

**టీ మీడియా, జూన్ 17 , తాండూర్ :** మంచిర్యాల జిల్లా తాండూర్, భీమారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న విక్రేతపై బుధవారం పీడీ చట్టాన్ని అమలు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందిన వూస సుబ్బారావు రామగుండం కమిషనరేట్ పరిధిలోని తాండూర్, భీమిని, భీమారం, బెల్లంపల్లి– 2 టౌన్, తాళ్లగురిజాల, నెన్నెల, చెన్నూర్ మండలాల్లో ఏజెంట్లను నియమించుకుని నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.ఈ ఏడాదిలో వూస సుబ్బారావుపై రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గాలను ఎంచుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్ నిందితుడికి పీడీ ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. సీపీ మాట్లాడుతూ వూస సుబ్బారావు 2021 నుంచి 2025 వరకు ఐదు సంవత్సరాలుగా నకిలీ పత్తి విత్తనాల రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన అనేక క్రిమినల్ కేసుల్లో పాలుపంచుకున్నాడని వివరించారు.నిందితునిపై ఈ నెల 10న పీడీ చట్టం అమలు చేయగా దానిని ప్రభుత్వం ధృవీకరించిందని పేర్కొన్నారు. పీడీ చట్టం అమలైన తర్వాత కూడా తన వైఖరిని మార్చుకోకుండా అదే తరహా నేరాలకు పాల్పడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జిల్లా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పేర్కొన్నారు. ఏడాది వ్యవధిలో రెండుసార్లు పట్టుబడినట్లు వివరించారు. పీడీ చట్టం అమలుకు కృషి చేసిన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్‌ను సీపీ అభినందించారు.



## ఉన్నత స్థానానికి వెళ్లాలి

- బచ్చురామ్ కు సన్మానం

**టీ మీడియా, జూన్ 17, వనపర్తి బ్యూరో :** వనపర్తి ఆణిముత్యం ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు బచ్చురామ్ కు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ ఇవ్వడం జరిగింది.తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన బచ్చురాము కి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. వనపర్తి బచ్చురాముకు ఆర్యవైశ్య రాజకీయ కమిటీ వైసచైర్మన్ ఇవ్వడం సంతోషకరమ్ వనపర్తి ఆర్యవైశ్య ముద్దుబిడ్డైనా ఆణిముత్యం బచ్చురాము వనపర్తికి చేసిన ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు.ఆర్టీసీ బస్టాండ్ లో మహిళలకు ఉచిత టాయిలెట్స్ కట్టించడంలో ఎంతో కృషి ఆర్టీసీ చైర్మన్కు ఆర్టీసీ డిపో మేనేజర్ కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ లో కట్టించడం జరిగింది. పట్టణ ఆర్యవైశ్యులకు ప్రజలకు ఎంతో సేవ చేయడం జరిగింది. గతంలో పీఎం విశ్వకర్మ వేల మందికి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇప్పించడం జరిగింది. మరి అదేవిధంగా పిలిస్తే పలికే బచ్చురాము కి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం వల్ల డాక్టరేట్ అవార్డు రావడం జరిగింది. బచ్చురాము సంతోషంగా ఇంకా ప్రజలకు సేవ చేయాలని బిజెపిని బలోపేతం చేయాలని, రాబోయే కాలంలో ఇంకా ఉన్నత స్థానానికి వెళ్లాలని భారతీయ అంతా పార్టీని బలోపేతం చేయాలని ప్రజలకు ఇంకా సేవలు చేయాలని మీ సేవలు వనపర్తికి ఎంతో చాలా అవసరమని తెలిపి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, మాజీ అధ్యక్షుడు మండల వెంకటేష్ పాల్గొనడం జరిగింది.




## ఉద్యోగుల చట్టపరమైన హక్కులపై అవగాహన

- పాల్గొన్న డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, జూన్ 17, వనపర్తి బ్యూరో :** హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించిన ఎఐపిసి–టుగెదర్ ఫర్ టెక్ లైవ్స్ లిసనింగ్ సర్కిల్ జూన్ 14న నిర్వహించిన ఎఐపిసి ఐటీడ ఐటీఈఎస్ విభాగం యొక్క "టుగెదర్ ఫర్ టెక్ లైవ్స్ లిసనింగ్ సర్కిల్‌లో సుమారు 30 మంది ఐటీ నిపుణులు పాల్గొని ఉద్యోగాల కోతలు, ఉద్యోగ భద్రత, ఉద్యోగుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి చట్ట పరమైన అవగాహన వంటి అంశాలపై చర్చించారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఐటీడ ఐటీఈఎస్ విభాగం రాష్ట్ర అధిపతి నితిజ్ఞ హర్కారా నాయకత్వం వహించగా, రాజ్ సిరిసిల్ల సమన్వయం చేశారు. పదవీ విరమణ పొందిన జిల్లా న్యాయమూర్తి, న్యాయవాది నెరెళ్ల మాల్యాద్రి ఉద్యోగుల హక్కులు, చట్టపరమైన అవగాహన, వృత్తి స్థిరత్వంపై విలువైన సూచనలు అందించారు.డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఉద్యోగుల సంక్షేమం, విధాన రూపకల్పనలో భాగస్వామ్యంపై దృష్టి సారించగా, శశాంక్ పసుపులేటి నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, నిపుణుల కోసం ఎంఎస్ఎంఈ అవకాశాల ప్రాముఖ్యతను వివరించారు.తెలంగాణ ఐటీ ఉద్యోగుల కోసం బలమైన సహాయక వ్యవస్థలు, చట్టపరమైన మార్గదర్శకత్వం, నిరంతర నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని గురించి చెబుతూ కార్యక్రమం ముగిసింది.

## సొంతింటి కళ నెరవేరస్తున్న ప్రభుత్వం

**టీ మీడియా, జూన్ 17 పెబ్బేరు:**పెబ్బేరు మండలం లోని రాంపురం గ్రామంలో నూతనంగా ప్రజా ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో వారి ఆహ్వానం మేరకు పాల్గొని ఇంటి యజమాని శేఖర్ ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు ఈ సందర్భంగా లబ్ధిదారుడు



మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ గృహప్రవేశ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్దన్ రెడ్డి జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్ పెబ్బేరు టౌన్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి మండల సీనియర్ నాయకులు సత్యాన్నారాయణ రెడ్డి ఆశన్న నాయుడు రామ్మోహన్ రెడ్డి బాలరాజు యాదవ్ మురళీధర్ రెడ్డి ఆంజనేయులు పురుషోత్తం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.